# వెన్నెల కాటు

## వెన్నెల రేటెంత?

అర్ధంకానట్లు చూశాడు ఆనందరావు.

"అలా దేభ్యం మొహం వేసుకు చూస్తావేంరా? వెన్నెలరేటెంత?" రెట్టించాడు రాంబాబు.

"ఒరే...నువ్వు తెలుగులోనే మాట్లాడుతున్నావా అనే అనుమానం నాకు కలిగించక, నీ వెధవ కవిత్వం వాగుడు మానేసి, నాకర్ధమయ్యేట్లు మాట్లాడు... లేకపోతే, నాకూ ఇంగ్లీషు వచ్చుగనుక, అందులోనే మాట్లాడు..."

పకపక నవ్వేసి

"పిచ్చి సన్నాసీ! ఆరు నెల్ల స్నేహంతో వారు వీరవుతారని మనసామెత. ఆరేళ్ళ స్నేహంతోకూడా నేనింకా నీకు అర్ధంకాలేదంటే, ఐ పిటీ యూ... రేపు మీ ఆవిడ నీతో చాలా కష్టాలు పడకతప్పదు." అన్నాడు రాంబాబు.

"లెక్చర్ మానేసి, విషయంలోకి రారా...?

"ఆల్‌రైట్! ఇవేళ తిథి ఏమిటి?"

"పున్నమి!"

"సంతోషం! నీకదయినా గుర్తున్నందుకు ధన్యవాదాలు. ఈరోజు మన కార్యక్రమం ఈవ్స్ గార్డెన్ వైపు వెళ్లటం.... అవునా?"

"మధ్యలో ఈవ్స్ గార్డెనెక్కడనుంచి వచ్చింది? అలాంటిది ఉన్నట్లు నాకు తెలియదే!" తెల్ల మొహం వేశాడు.

"ఒరే తెల్లమొహమా! అమ్మాయిలెక్కువగా వచ్చే గార్డెన్ ఏదో అదే ఈవ్స్‌గార్డెన్..."

"నీతో ఛస్తున్నారా! ఒరే బాబూ... నా మాట విను... నీ మడత మాటలు మానేసి మామూలుగా మాట్లాడరా నాయనా..."

"లాభం లేదురా! నిన్ను లవర్స్ స్కూల్లో ఎల్.కె.జికి పంపాల్సిందే!"

"మళ్ళీ అదేమిటి? అది కూడా ఒకటి పెట్టించావా?! నువ్వు అన్నింటికీ సమర్ధుడివి..."

"ఇంకా నీలాంటి సన్నాసులు దేశంలో ఎంతమంది ఉన్నారో తెలియదుగదా? అంచాత, స్కూలు ప్రారంభిస్తే సమాజానికి మేలుచేసినట్లవుతుంది.."

"ఏవిధంగా?"

"ఆడపిల్లలకి త్వరగా పెళ్లవుతుంది గనుక! గుడ్లు మిటకరించి చూశాడు ఆనందరావు.

"ఒరే.. నీ పేరు మార్చేసి అయోమయంరావని పెట్టాలి! ఇంతటి చిన్న విషయాలుకూడా నీకర్ధమై చావకపోతే ఎందుకు నీ వెధవ జన్మ... టీ కప్పులో దూకి చావు.."

"నేనేమన్నా ఈగనీ దోమనీ ఏమిటి టీకప్పులో దూకి చావటానికి..." ఉడుక్కున్నాడు.

"నీకంటే అవేనయం! నీతో నాక్కుదరదుగానీ. ... నువ్వు నే వచ్చేసరికల్లా చక్కగా వంటచేసిపెట్టు. నే నొక రౌండుకొట్టి వస్తాను..."

"ఏమిటి?! నేను వంటచేస్తూ కూర్చుంటే నువ్వు రౌండ్లు కొట్టివస్తావా? ఇదేమయినా న్యాయంగా ఉందిరా నీకు?"

"ఒరే ఆనందం! నీతో నేను చావలేను...నాకు బి.పి పెరిగేలా ఉంది....నువ్వు రాదలుచుకుంటేరా... లేకపోతే, నీపాట్లు నువ్వు పడు, మధ్యలో నన్ను నసపెట్టి చంపకు...నేను వెళ్తున్నాను.." రాంబాబు ఓ మాటు 'టక్' సరిచేసుకుని ఈలవేసుకుంటూ వెళ్లియేడు.

ఆనందరావు అలాగే ఖిన్నుడై నిలబడిపోయేడు.

** ** **

లైటు వెలుగుతోంది.

పోటీలు వేసుకున్నట్లు ఒకదాన్ని ఒకటి ఢీకొంటూవెళ్లి లైటుమీదకి దూకుతున్నాయి దీపం పురుగులు.

ఆనందరావు చేతిలో పుస్తకం ఉంది.

కళ్లు దీపంవైపు చూస్తున్నాయి.

'టిక్‌టిక్' మంటున్న 'అలారంపీస్' క్షణాల్ని లెక్కపెడుతోంది. కొంచెం అవతలగా మంచంమీద రాంబాబు ఆదమరిచి నిద్రపోతున్నాడు. ఫానుగాలికి అతని బట్టలమీదున్న సెంటువాసన గదంతా వ్యాపిస్తోంది.

మెడలో ఉన్న బంగారు గొలుసు లైటు కాంతిలో మిల మిల మెరుస్తోంది. ఆనందరావు రాంబాబు కేసి తదేకంగాచూశాడు.

అవును!

తమ స్నేహం ఆరేళ్లపాతది!

కాలేజీలో ఆరంభమై ఉద్యోగపర్యంతాకా కొనసాగుతూనే ఉంది. అప్పటికీ, ఇప్పటికీ ఇదే గది!

రాంబాబుది దూకుడు స్వభావం.

మనిషి ఆకర్షణీయంగా ఉంటాడు. మాటల్లో



గారడీ ఉంది. ఇక అతని ఆడ స్నేహాలకి లెక్కలేదు!

తనెందుకనో అందుకు పూర్తివ్యతిరేక స్వభావి!

మనిషికి కొన్ని ఆదర్శాలుండాలి. నలుగురిలో గౌరవం ఉండాలి. డబ్బుకంటే విలువైన పరపతి ఉండాలి

ఈ మూడు భావాల్నీ గట్టిగా నమ్మకుని, నడుస్తున్నాడు తను....

అయితే అంతరాంతరాలలో ఒక బాధ ముల్లులాగు గుచ్చుతుంటుంది.

రాంబాబులో ఉన్న ప్రత్యేకతలు తనలో లేకపోవచ్చు.

కానీ, తనని చూసి అభిమానించి ప్రేమించే యువతి ఒక్కరు కూడాలేరా?

ఉన్నారు. కానీ, తామింకా ఒకరికొకరు తారసపడలేదు!

అందమైన అమ్మాయిలు ఎదురుపడినప్పుడల్లా ఆశగా వాళ్లకళ్లల్లోకి చూస్తుంటాడు. ఎవరైనా చిరునవ్వు చిందించి, మనసు పొంగిస్తారేమోనని. వాళ్లసలు తన ఉనికినే గమనించకుండా వెళ్లిపోతుంటారు!

అప్పుడే మనసు చివుక్కుమంటుంటుంది.

మళ్ళీ తనకి తనే ధైర్యం చెప్పుకుంటాడు...

అప్పుడప్పుడు ఆనందరావుమీద అమితకోపం వస్తుంది. వీడింత పాత స్నేహితుడే! కనీసం, తన స్నేహి



తుర్రాళ్లలో ఒకర్ని తనకి పరిచయం చేయొచ్చుకదా? వెంట రమ్మనటమేగానీ, తీరా వెళ్లాక, దూరంగా ఉండి తన లీలా విలాసాలు చూడమంటాడు! ఆకలితో చచ్చేవాడిముందు షోగ్గా ఏపిల్ పండు తినే తత్వం వాడిది.

ఆనందరావు మనసు అలసిపోయింది.

లైటుతీసి పడుకున్నాడు.

మంచుకురుస్తున్న వెన్నెల.

మనసు స్వప్నలోకాలవైపు రెక్కలార్చుకుంటూ ఎగిరిపోయింది. అక్కడ — ఒక అపరంజి బొమ్మలాంటి అందాలభామ చిద్విలాసంగా నవ్వుతూ చేతులు చాచి స్వాగతం పలికింది...

ఆ చేతులు అతణ్ణి చుట్టుకున్నాయి.

ఆ తర్వాత అతను కరిగిపోసాగేడు!

ఎవరో సంకోచంగా తలుపుకొడుతున్నారు.

''రేయ్ ఆనందం! ఎవరో తలుపుకొడుతున్నారు చూడు...'' షేవ్ చేసుకుంటూ పురమాయించాడు రాంబాబు.

తలుపు తీసాడు.

ఎదురుగా మాసిపోయిన గడ్డంతో దీనంగా ఒక వ్యక్తి నిలబడి ఉన్నాడు.

''ఎవరు మీరు?'' ఆశ్చర్యంగా చూస్తూ ప్రశ్నించేడు.

''నా పేరు అప్పారావండి..''

''ఏం కావాలి మీకు?'' ఆనందరావ్ కి అతన్నెక్కడా చూసిన గుర్తులేదు—

''రాంబాబు గారంటే మీరేనాండి?''

ఆ ప్రశ్నకి ఉలిక్కిపడి అతనికేసి చూశాడు రాంబాబు.

''నేనే రాంబాబుని! ఏంకావాలి మీకు?'' దర్పంగా అడిగేడు.

''నేను... సుందరి అన్నయ్యనండీ!'' రాంబాబు ఉలిక్కి పడటం స్పష్టంగా కనిపించింది. అంతలోనే సర్దుకుని ''చెప్పండి...'' అన్నాడు బింకంగా...

అతనోక్షణం తబ్బిబ్బయి ''మా సుందరి పెళ్లివిషయం అడగటానికి వచ్చానండీ..'' అన్నాడు గొంతు సెకలించుకుని.

''మీ సుందరి పెళ్లివిషయం నన్నడగటం ఏమిటి'' అమాయకంగా ప్రశ్నించాడు.

''మీరు చేసుకుంటానన్నారట...''

''మీతో అన్నానా?''

తికమకపడి ''మా సుందరితో అన్నారుట...'' అన్నాడు.

''మీరు చెప్పే సుందరి ఎవరో నాకు తెలియదు''.

''అన్యాయం సార్! సుందరికిప్పుడు మూడోనెల'' గొంతులోకి దుఃఖం వచ్చేసింది.

''ప్లీజ్ గో... ప్రొద్దున్నే నా మూడ్ చెడగొట్టకండి విసుక్కున్నాడు. అప్పారావు కళ్లవెంట నీళ్లు జలజల రాలేయి. నిశ్శబ్దంగా ఏడవసాగేడు. ఆనందరావు ఖిన్నుడై చూస్తున్నాడు. రాంబాబు అసహనంగా ఉన్నాడు.

''ఏడిచే మగాళ్లని చూస్తే నాకసహ్యం.. ముందు అవతలికెళ్లండి'' అరిచాడు.

# కాటూరు రవీంద్ర త్రివిక్రమ్

అప్పారావు మరోమాట లేకుండా వెళ్ళిపోయేడు.

ఆ షాక్ నుండి తేరుకుని మామూలు మనిషికావటానికి ఆనందరావుకి అయిదు నిముషాలు పట్టింది. ఆరోనిముషంలో తలుపు నెవరో ఢడాలున తన్ని లోపలికి వచ్చారు. నేరుగా రాంబాబు దగ్గిరకెళ్లి ఆపకుండా అయిదునిముషాలు విరగదన్ని ''ఇప్పుడు చెప్పు బే! సుందరి ఎవరో నీకు తెలియదా?'' కర్కశంగా అడిగాడు.

''మీరెవరు?'' వాచిపోయిన మూతి తడుముకుంటూ భయం భయంగా అడిగాడు రాంబాబు.

''సుందరి చిన్నన్నని...''

''అయామ్ సారీ! ఇందాక పొరబాటున అన్నాను సుందరిని పెళ్లిచేసుకుంటాను...''

''రేపే పెళ్లి... వేణుగోపాలస్వామి ఆలయంలో.. ఊరొదిలి పోవాలని చూశావా.... కీళ్లు విరిచేస్తాను. ...బయట నా మనుషులు ఎప్పుడూ నిన్ను గమనిస్తుంటారు జాగ్రత్త..'' నేల అదరగొడుతు వెళ్లేడు...సుందరి చిన్నన్న.

రాంబాబుకి కాలు, చెయ్యి స్వాధీనంలోకి రావటానికో పదినిముషాలు పట్టింది.

అతనికేసి జాలిగా చూస్తున్నాడు ఆనందరావు. ఇలాంటి దుర్గతి తనకి పట్టనందుకు తనని తను అభినందించుకున్నాడు.

''రేయ్ ఆనందం! ఈ పెళ్లి తప్పించుకునే మార్గం ఆలోచించు...'' ప్రయాసగా లేచి కుర్చీలో కూర్చుని ఆయాసంగా అన్నాడు.

''ఇంకా నీకు బుద్ధిరాలేదా?!'' ఆశ్చర్యంగా అన్నాడు ఆనందరావు.

''ఇందులో తప్పేముంది? అందం ఉన్నదెందుకు? ఆనందించటానికే!'' తాపీగా సిగరెట్ వెలిగించుకుంటూ అన్నాడు.

''ఒరేయ్! ఇన్నాళ్లూ నువ్వేదో మనిషనుకుని పొరబడ్డాను. ఏదోలే సరదా స్నేహాల్లెమ్మనుకున్నాను. నీవల్ల ఓ పిల్ల తల్లి కాబోతూ జీవితం బుగ్గి చేసుకోబోతుంటే... నీకు చీమకుట్టినట్లు కూడా లేదేరా?! ఇదే నీ చెల్లెలికి జరిగితే?''

''చంపేస్తాను..'' ఆవేశంగా అరిచాడు.

''ఎవర్ని?''

''ఇద్దర్నీ!''

''కాబట్టి, ఇప్పుడు నిన్నుకూడా చంపొచ్చుకదా?''

తలొంచుకున్నాడు రాంబాబు.

''వాళ్ళుకాదు! నువ్వు పిచ్చివేషాలు వేస్తే నేను చంపుతాను. వెన్నెల రేటెంతని అడిగేవాడివి కదా? వెన్నెల రేటు ఎంతోగానీ, వెన్నెలకాటు ఎలా ఉంటుందో నేను నీకు చూపిస్తాను.... నువ్వు సుందరిని పెళ్లిచేసుకుంటున్నావ్ అంతే'' ఆనందరావు గర్జించాడు. రాంబాబు ఓడిపోయినవాడిలా కుర్చీలో డీలాపడిపోయాడు.